క్లుప్తంగా

పదవీ విరమణ సహజం

ఎంపీపీ పద్మారెడ్డి



సరస్వతి దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

మాడ్గుల: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరస్వతి పదవీ విరమణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పద్మారెడ్డి మాట్లాడుతూ.. పదవీ విరమణ తదుపరి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు. 37 ఏళ్ల ఉద్యోగ జీవితంలో సేవ దక్షతతో పని చేశారని కొనియాడారు. అనంతరం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు జైపాల్ రెడ్డి, కొత్త పాండుగౌడ్, మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం

పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్య సంచరిస్తున్న పందులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలో పందుల స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్ల మధ్యలో గుంపులు, గుంపులుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పందుల పెంపకం దారులకు నోటీసులను జారీ చేసి, వారికి భూమిని కేటాయించినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇళ్ల మధ్యలో తిరుగు తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమవు తున్నా చర్యలు శూన్యం. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలలకు మిషన్ భగీరథ నీళ్లు

ఎంపీపీ కొప్పు సుకన్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మిషన్ భగీరథ నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. శనివారం ఆమె వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా చేసేలా కనెక్షన్లు ఇవ్వాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్‌కు నేతల నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతిపై కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు పీసీసీ అధ్యక్షుడిగా, మాజీ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా తనదైన ముద్రవేశారని అన్నారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని అన్నారు. సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ఉన్నారు.

తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల్లోని సీఓఈ కళాశాల, స్కూల్‌లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్‌సీఓ కె.నాగకళ్యాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఓఈ, నాన్ సీఓఈ కళాశాల, పాఠశాలల్లో అన్ని సెక్షన్లు, సబ్జెక్టులకు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను జూలై1వ తేదీ లోపు చైతన్యపురిలోని ఆర్‌సీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. జూలై 2వ తేదీన సరూర్‌నగర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ఎట్టకేలకు బ్రిడ్జి పనులు ప్రారంభం

- రెండేళ్లుగా నిలిచిపోయిన నిర్మాణం
- నిత్యం నరకం చూస్తున్న వాహనదారులు
- త్వరలో తప్పనున్న ఇక్కట్లు



ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణ పనులు

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌- ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారి ఇందు కళాశాల వద్ద గత రెండేళ్లుగా నిలిచిపోయిన బ్రిడ్జి(వంతెనా) నిర్మాణ పనులు తిరిగి శనివారం ప్రారంభమైమయ్యాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2022 సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నిండి అలుగు దూకిన సంగతి తెలిసిందే. సుమారు 45 ఏళ్ల తర్వాత చెరువు మత్తడి దూకి వరద ప్రవాహం ఉధృతంగా పారడంతో ఇందు కళాశాల వద్ద గల ప్రధాన రహదారిలోని కల్వర్టు పైపులు కొట్టుకుపోయాయి. ప్రధాన రోడ్డులోని డివైడర్లను తొలగించి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవడంతో అప్పట్లో రాకపోకలకు కొంత ఉపశమనం లభించింది. సుమారు నెలరోజుల పాటు వరద నీటి ప్రవాహం కొనసాగడంతో వాహనదారులు, ప్రజల ఇబ్బందులు పడ్డారు. పెద్ద చెరువులోకి 39, 40 ఫీట్ల మధ్య నీరు వస్తే మత్తడి దూకుతుంది. అయితే మళ్లీ వర్షాలు కురిస్తే ఇదే పరిస్థితి వస్తుందని, దీనికి శాశ్వత పరిష్కారం చేపట్టాలని అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి సుమారు 4.84 కోట్ల నిధులను బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేయించారు. ఆ తరువాత బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఇందు కళాశాల నుంచి ఇబ్రహీంపట్నం వచ్చే ఒకవైపు రహదారిలో బ్రిడ్జి నిర్మాణ పనులు ముందుగా చేపట్టి స్లాబ్ వరకు నిర్మించి ఆర్ధాంతరంగా వదిలిపెట్టారు. నిధులు మంజూరుకాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ చేతులెత్తిసినట్లు సమాచారం. దీంతో ఒకే రహదారిలో ఫోర్, టూ వీల్లర్, భారీ వాహనాలు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గత సంవత్సరం సరైన వర్షాలు కురువకపోవడంతో ఈ ప్రాంతానికి వరద తాకిడి రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆరు నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు ఆందోళనలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎన్నికల కోడ్ ముగియగానే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ అధికారులతో ఇటీవలతో చర్చించి నిర్మాణ పనులు చేపట్టాలని, అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. దీంతో ఆగిపోయిన పనులను శనివారం తిరిగి చేపట్టారు. నిరాటంకంగా పనులు చేపట్టి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

> **పనులు ప్రారంభించడం సంతోషం**
>
> 
>
> బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మాణం పనులు ఆగిపోయిన బ్రిడ్జి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి తిరిగి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉంది.. ఇందుకు కృతజ్ఞతలను తెలియజేస్తున్నా.
>
> – రవీందర్‌రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్, ఇబ్రహీంపట్నం

సంక్షోభంలో విద్యార్థుల భవిష్యత్

- కేజీబీవీని ప్రారంభించాలి
- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్



నిరసన దీక్ష చేపట్టిన ఏబీవీపీ నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి, తరగతులు నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు దాటినా తరగతులు ప్రారంభించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం తగదని నిరసిస్తూ, ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. గతంలో అద్దెభవనంలో కొనసాగిన కేజీబీవీ పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని, అనేక మంది విద్యకు దూరమయ్యారని ఆరోపించారు. నూతన భవనాన్ని ప్రారంభించకపోవడంతో విద్యార్థులు జీవితాలు సంక్షోభంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు సమస్యను పట్టించుకోకుండా కాలయాపన చేయడం తగదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ పాఠశాలను ప్రారంభించని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ సీనియర్ నాయకులు మురళీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్, నాయకులు మల్లేష్, పవన్, మధు, శివ, ప్రవీణ్, మల్లేశ్, సుమన్, అనిల్, భద్రు ఉన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించండి

వెదెరె హన్మంత్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి తదితరులు

మంచాల: మండల పీఏసీఎస్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిపాజిట్లు చేసి బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దీర్ఘకాలిక రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించాలన్నారు. ఉన్నతాధికారుల సహకారంతో త్వరలో రైతులకు రుణాలు అందిస్తామన్నారు. జూలై 4న జరిగే సర్వసభ్య సమావేశానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. రైతుబంధు, రైతు భరోసా కార్యక్రమంపై అభిప్రాయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ చింతకింది శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు వెంకటేశ్, రమేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

ఏఐసీసీ సభ్యుడు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వంశీచంద్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్: ఆపదలో ఉన్న కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఏఐసీసీ సభ్యుడు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముద్వీన్ గ్రామ మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య కుటుంబాన్ని, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం వంశీచంద్ పరామర్శించారు. యాదయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్ యాదయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, యాదయ్య మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని విచారం వ్యక్తం చేశారు. యాదయ్య కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. తక్షణసాయంగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు ఉన్నారు.

ఫార్మాసిటీ రద్దు గెజిట్‌ను ప్రకటించాలి

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్



మర్పల్లి అంజయ్య యాదవ్

యాచారం: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ఫార్మాసిటీని సేకరించిన భూములను మళ్లీ రైతులకే తిరిగి ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, తిరిగి సేకరించిన భూములను రైతులకే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిందన్నారు. కావునా, కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తామని గెజిట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో మళ్లీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. పట్టా భూములను రైతులకు ఇచ్చేసి సేకరించిన అసైన్డ్ భూముల్లో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు చేశామని కాంగ్రెస్ పెద్దలు చెబుతుంటే, మళ్లీ టీఎస్ఐఐసీ అధికారులు భూసార పరీక్షలంటూ ఆ భూముల్లోకి ఎలా వస్తారని ప్రశ్నించారు.

లేబర్ ఇన్సూరెన్స్ పథకంతో లబ్ధి

బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్

తలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పా, తెల్లరేషన్ కార్డులు ఉన్న వారందరూ అర్హులేనని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాదికి రూ. 22 చొప్పున 5 సంవత్సరాలకు కలిపి ఒక్కసారి రూ. 110 చెల్లించాలని చెప్పారు. 18 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల మహిళలు, పురుషులు అర్హులన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు, బ్యాంక్ చాలనలను పూర్తి చేసిన దరఖాస్తు పత్రానికి జత చేసి షాద్‌నగర్ లేబర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పాలసీదారు సహజ మరణం పొందితే రూ.1,30,000 ఇన్సూరెన్స్ నామినికి, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6,00,000 ఇన్సూరెన్స్ నామినికి వస్తాయని, ఇక ఇంట్లో ఇద్దరు ఆడ పిల్లలు ఉంటే ఒక్కొక్కరికి వివాహ నజరానాగా రూ. 30 వేల చొప్పున వచ్చే అవకాశముందని అనిల్ తెలిపారు. 1 సంవత్సరం పాలసీ పొందిన తర్వాత లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50 శాతం వికలాంగులుగా ఉంటే రూ. 2,50,000, 100 శాతం ఉంటే రూ. 5,00,000 నష్ట పరిహారం పొందే అవకాశముందన్నారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు.

రుణమాఫీ చేస్తాం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యాదయ్య

తలకొండపల్లి: ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేయనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోల యాదయ్య అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు చేరువయ్యామన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఇచ్చిన హామీ మేరకు రూ. లక్షతో పాటు, తులం బంగారం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు పంట పెట్టుబడి సహాయంగా సంవత్సరానికి రూ.15 వేలు, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ. 2500, కౌలు రైతులకు రూ.15 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

భౌతికకాయానికి నివాళి



నివాళి అర్పిస్తున్న వంశీచందర్ రెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండలం అప్పారెడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌరవరం లక్ష్మారెడ్డి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచందర్ రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పద్మా రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భక్తిభావంతో ప్రశాంతత

హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతిస్వామిజీ



యాచారం: భక్తిభావంతో సంతోషం, ప్రశాంతత ఉంటుందని హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ పేర్కొన్నారు. పర్వతారోహకుడు అంగోత్ తుకారాం, మానస దంపతులు తక్కళ్లపల్లి తండాలో నిర్మించిన బంగారుమైసమ్మ తల్లి ఆలయ చతుర్ధ ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిభావం ఉన్న చోట దేవాలయాల నిర్మాణానికి పూనుకోవాలి, తద్వారా ప్రజల్లో దేవుడిపై ప్రేమ, భక్తి నెలకొంటుందన్నారు. చిన్న వయస్సులోనే అంగోత్ తుకారాం బంగారు మైసమ్మ తల్లి దేవాలయాన్ని నిర్మించి నిత్యపూజలు, వార్షికోత్సవాలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. దేవాలయాల నిర్వహణకు సర్కార్ ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ప్రజలు దేవుడిని పూజించే అలవాటు చేసుకోవడంతో ఆర్థిక, సంతోషకరమైన పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ కెమెరా దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కడ్తాల్: మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ కెమెరా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకోవడానికి కెమెరా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు విరివిగా రుణాలను అందించి, వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షుడు రబ్బానీ, కార్యదర్శి కిరణ్‌కుమార్, సభ్యులు నదీమ్, శివ, మహేశ్, కృష్ణ పాల్గొన్నారు.

3న సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మండల సర్వసభ్య సమావేశం(స్పెషల్ జనరల్ బాడి మీటింగ్) ఈ నెల 3న (బుధవారం) మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు సింగిల్ విండో సీఈఓ ప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగిల్ విండో కార్యవర్గ సభ్యుల సూచనలు, సలహాలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. కావునా సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మండలం ఏర్పాటు చేయాలని నిరసన



రహదారిపై బైఠాయించిన నాయకులు

మాడ్గుల: మండలంలోని ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ నాయకులు గ్రామ ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో 9 గ్రామాలతో ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించారు. అనంతరం ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరించారు. ప్రభుత్వం మారడంతో మండలం ఏర్పాటుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు, గతంలో కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి సంవత్సరం గడుస్తున్నా.. నేటికి మండల కేంద్రం ఏర్పాటుపై స్పష్టత లేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటయ్య, అశోక్, హరీశ్‌రెడ్డి, శ్రీశైలం, రాజురెడ్డి, రమేశ్, శివ, రాకేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్థానికులకు అన్యాయం చేయొద్దు

పీఆర్టీయూ నాయకులు పరమేశ్, వీర మల్లేశ్



వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో స్థానికులకు అన్యాయం చేయొద్దని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు పరమేశ్, మహేశ్వరం మండల అధ్యక్షుడు వీర మల్లేశ్‌లు కోరారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ సుకేష్‌నికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికేతరులకు రెండు మూడు కేటగిరిల్లో పోస్టులను కేటాయించాలన్నారు. స్పెషల్ కేటగిరి ఉన్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించి వారికి ఫైనల్ జాబితా పొందుపరచాలన్నారు. ఎవరైతే రెండు సార్లు ప్రమోషన్లు రిజెక్టు చేశారో వారిని ప్రమోషన్ జాబితా నుంచి తొలగించాలని కోరారు. క్లియర్ వెకెన్సీ, 8 సంవత్సరాలు వెకెన్సీ పూర్తిగా పొందుపర్చలేదని చాలా మంది ఉపాధ్యాయులు తెలియజేశారని దానిని సవరించి జిల్లాలో ఉన్న పూర్తి వెకెన్సీ జాబితా ఏర్పాటు చేయాలన్నారు. కొందరు ఉపాధ్యాయులు గతంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్నప్పుడు స్పౌజ్ పాయింట్లు ఇవ్వడం జరిగింది. కాని ఇప్పుడు వారు హెడ్ మాస్టర్ ప్రమోషన్‌లో వెళ్లారని తెలిపారు. ఇతర జిల్లాకు ఆ ఉపాధ్యాయుల పాయింట్లను సవరించాలన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయుల కౌన్సిలింగ్‌లో రోజుకు 500 మంది చొప్పున నిర్వహించాలన్నారు. స్పౌజ్ పాయింట్స్ ఎవరైతే పొందుతున్నారో వారి స్పౌజ్ దగ్గరికి పోయేలా చర్యలు తీసుకొని పోస్టింగ్ ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కారానికి ఉపాధ్యాయుల పక్షాన పీఆర్టీయూ పోరాడుతుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



సులోచన దంపతులను సన్మానించిన పీఆర్టీయూ నేతలు, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు, కవయిత్రి గద్దం సులోచన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పి. పరమేష్ సన్మానించి, అభినందనలు తెలిపారు. ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు సహోపాధ్యాయులుగా ఆమె పనిచేస్తూ శనివారం పదవీ విరమణ చేశారు. సులోచన ఆమె భర్త లక్ష్మీనారాయణరెడ్డిలను సత్కారిస్తూ సన్మానసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలుగా సేవలందిస్తూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన సులోచన పదవీ విరమణ చేయడం బాధకరమైనప్పటికీ, ఉద్యోగ రీత్యా తప్పదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఉపాధ్యాయులు అరుణాదేవి, దమయంతి, శ్రీలతతో పాటు సులోచన బంధుమిత్రులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి

వైస్ఎంపీపీ జక్కు అనంతరెడ్డి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అనంతరెడ్డి

ఆమనగల్లు: సీఎం రేవంత్‌రెడ్డి రైతుపక్షపాతి అని వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసి తీరుతుందని చెప్పారు. ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ ఆరు గ్యారంటీలు ప్రకటించారని ఆ మేరకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.